మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు బిజెపి మద్దతు

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఆవరణలో నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మంచిర్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు వెరవెల్లి రఘునాథ్‌తో కలిసి శుక్రవారం సంఘీభావం తెలిపి మాట్లాడారు. యేండ్ల తరబడి విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు 11రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు బిజెపి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేష్, గోనె మార్కండేయులు తదితరులు ఉన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, కేసు నమోదు చేయాలి

**టిపిసిసి కార్యదర్శి దేవులపల్లి యాదగిరి**

**సిద్ధిపేట రూరల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుతో పాటు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదుచేసి వారి సభ్యత్వాలు రద్దు చేయాలని టిపిసిసి కార్యదర్శి దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం ఎసిపి మధుకు ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. హరీష్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిలు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి అసభ్యకరంగా ప్రవర్తించి అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తప్పెట శంకర్, చెలికాని యాదగిరి, ముస్యాల యాదగిరి, జంగిటి శ్రీనివాస్, గోనెపల్లి శివగౌడ్, అనరాజు నాగరాజు, చేర్యాల బాలయ్య, బస్వరాజు రాములు, దేవులపల్లి చింటూ, ముక్కెర లింగం యాదవ్ పాల్గొన్నారు.

## గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన
### జిల్లా కలెక్టర్



సాంఘిక సంక్షేమ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
ఈనెల 22వ తేదీన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మెదక్ చర్చి, కొల్చారంలోని సాంఘికసంక్షేమ గురుకుల బాలికలపాఠశాల, కళాశాలలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ మండల కేంద్రమైన కొల్చారంలోని సాంఘికసంక్షేమ పాఠశాలలో డైనింగ్‌హాల్, డార్మెటరీ, పరిసర ప్రాంతాలను, అందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. గవర్నర్ పర్యటన రూట్ మ్యాప్ ప్రకారం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. గవర్నర్ రాక మొదలుకుని కార్యక్రమాలు పూర్తిచేసుకుని తిరిగి బయలుదేరే వరకూ షెడ్యూల్ ప్రకారం పర్యటన సాగేలా ఏర్పాట్లను గురించి చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహీపాల్ రెడ్డి, కొల్చారం తహశీల్దార్ గఫార్ మియా, ఎంపీడీవో కృష్ణవేణి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారి కళ్యాణానికి సిపికి ఆహ్వానపత్రిక



సిపి డా॥అనురాధకు ఆహ్వానపత్రిక అందిస్తున్న అధికారులు, అర్చకులు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
కొమురవెల్లి మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి కళ్యాణం ఈనెల 29న నిర్వహిస్తుండడంతో కళ్యాణానికి రావాలని కోరుతూ సిపి కార్యాలయంలో శుక్రవారం సిపి డా॥అనురాధకు ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానపత్రికను అందజేశారు. అలాగే స్వామివారి మహా ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీశర్మ, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ధర్మకర్తల మండలిసభ్యులు మామిడాల లక్ష్మి, అల్లం శ్రీనివాస్, చిగిరి కొమురయ్య, అర్చకులు చిన్న మల్లికార్జున్, భాస్కర్, బసవేశ్వర్ తదితరులు ఉన్నారు.

## ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేయాలి
### –జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



నేర సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**మెదక్ రూరల్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేయాలని, ప్రతిగ్రామాల్లో సిసి కెమేరాల సంఖ్య పెంచాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, నేరాలు తగ్గేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం మెదక్‌జిల్లా పోలీస్ ప్రధానకార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జిల్లా సిబ్బందితో నేర సమీక్షాసమావేశం నిర్వహించడం జరిగింది. సందర్భంగా పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులగురించి సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తమతమ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాలను పోలీస్ అధికారులు సందర్శించాలని, ట్రబుల్ మాంగర్స్, తరచుగా తగాదాలకు, నేరాలకు పాల్పడేవారిపై నిఘా ఉంచాలని, గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగే షన్ చేసేటప్పుడు ఏవిధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి, ఏయే అంశాలు క్రోడీకరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని, ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. లాంగ్ పెండింగ్‌కేసులు, గుర్తుతెలియని మృతదేహాల కేసులు త్వరగా ఛేదించాలి, అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలని, సైబర్‌నేరాల నియంత్రణ గురించి తెలియ చేస్తూ సైబర్ నేరానికి గురి అయినవారు వెంటనే సైబర్‌క్రైమ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1930కి కాల్ చేయాలని అన్నారు. అలాగే సిసి కెమేరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ డిఎస్పీ ప్రసన్న కుమార్, సైబర్ క్రైమ్ డిఎస్పీ సుభాష్ చంద్రబోస్, జిల్లా సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమిత్‌షా దిష్టిబొమ్మ దగ్ధం

**కొమురవెల్లి, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.అర్,అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల పరిధిలోని రాంసాగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అమిత్‌షా దేశప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీసభ్యులు తాడూరి రవీందర్, ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్, గ్రామ నాయకులు తాడూరి మల్లేశం, రాజలింగం, గణేష్, నర్సయ్య, రాజయ్య, బాలమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షా వ్యాఖ్యలకు భగ్గుమన్న దళితవర్గాలు



అమిత్‌షా చిత్రపటాన్ని దగ్ధం చేస్తున్న దళితులు



దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

**ములుగు, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
ప్రపంచ దేశాల్లోకెల్ల ప్రముఖమైనది భారత రాజ్యాంగం అని, అలాంటి రాజ్యాంగం కోసం రేయింబవళ్ళు శ్రమించిన దళిత బహుజనుల బంధువు బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని ములుగు మండలం మామిడ్యాల గ్రామ దళితవర్గీయులు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం మండల పరిధిలోని వంటిమామిడి రాజీవ్ రహదారిపై అమిత్‌షా చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రగతి, సబ్బండ వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా నిర్విరామంగా శ్రమించిన మహనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. అలాంటి మహనీయుడిపై పార్లమెంట్‌సాక్షిగా కేంద్రమంత్రి అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే అమిత్ షా కేంద్రమంత్రి అయ్యారని, వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో కర్రోళ్లమల్లేష్, నలపేటఆనంద్, ఎడ్లకరుణాకర్, మన్నెమల్లేష్, ఇటిక్యాల నాగ రాజు, పురుగులబాలరాజు, బొల్లంరఘుపతి, ఎడ్లశివకుమార్, మన్నె లక్ష్మీనారాయణ, జీడి గంటిహరీష్, పొట్టనర్సింలు, మన్నెయాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**కొడకండ్లలో అమిత్‌షా దిష్టిబొమ్మ దగ్ధం...**

**గజ్వేల్, డిసెంబరు 20 (ప్రభాతవార్త):** పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను శుక్రవారం గజ్వేల్‌మండలం కొడకండ్ల గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుండి గాంధీవిగ్రహం వరకు ర్యాలీ తీసి రాజీవ్ రహదారిపై దగ్ధంచేశారు. ఈసందర్భంగా అంబేద్కర్ సంఘం సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అంబేద్కర్ కాళ్ళుమొక్కి ప్రాయశ్చితం చేసుకోవాలని తెలిపారు. మత మనువాద సిద్ధాంతాలను పోయిన ఎన్నికల్లో ప్రజలు తిప్పి కొట్టారని, అయోధ్య నుండే పతనం మొదలైందని, ప్రజలు వచ్చే ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు చంద ప్రవీణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ముంద్రాతి రాజు, మాజీ ఎంపిటిసి అరిగె అశోక్‌కుమార్, మాజీసర్పంచ్ ఎడ్ల భూమయ్య, ముత్యాల వేణుగోపాల్, కుక్కల శ్రీనివాస్, కరుణాకర్, రవి, వేణుగోపాల్, బాల్‌చంద్రం, బాలకృష్ణ, రవి, ప్రవీణ్, నర్సింలు, హరిబాబు, నరేష్, మనోజ్, అరిగె ప్రవీణ్, సత్యం, సంతోస్, భాను, కిష్టయ్య పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్



పాఠశాలలో గ్రంథాలయంను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**మునిపల్లి, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కంకోల్‌లోని ఎంపిపిఎస్ పాఠశాలలో రూం టు రీడ్ సంస్థ గ్రంథాలయాన్ని జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతినిత్యం విద్యార్థులు సమయానుసారం గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఇన్స్‌ట్రాక్షన్, లైబ్రరీకి సంబంధించిన మెటీరియల్స్ గురించి డీకోటబుల్ పుస్తకాలు 1వతగరతి చదువుకుంటున్న చిన్నారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటకప్రదర్శన నిర్వహించారు. డీకోటబుల్ బుక్స్‌ను, పేరెంట్స్ క్యాలెండర్‌లను కలెక్టర్ క్రాంతి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఈఓ వెంకటేశ్వర్లు ఎంఈఓ భీమ్‌రెడ్డి, ఎంపిడిఓ హరినందన్ రావు, మండల ప్రత్యేకాధికారి రామాచారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తుకారాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, ఉపాధ్యాయులు సంతోషమ్మ, వినోద, వనిత, రాణి, దేవకి, లావణ్య, రూం టు రీడ్ పిఓ ప్రవీణ్, పిఎ తేజస్విని, టిటరసీ ఫెసిలిటేటర్ సంధ్య, విజయశ్రీ, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం వద్ద బహిరంగ వేలంపాట



వేలంపాటకు హాజరైన వివిధ గ్రామాల ప్రజలు

**జగదేవ్‌పూర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన శ్రీకొండపోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ఈఓ రవి కుమార్, రెనోవేషన్ పాలకమండలి సభ్యుల, పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు, పూజారుల సమక్షంలో శుక్రవారం బహిరంగ వేలంపాటను నిర్వహించారు. కొబ్బరికాయలు, అమ్మవారి ఒడిబియ్యం, దుకాణ సముదాయాలకు నెలవారీ కిరాయికు వేలంపాట నిర్వహించారు. బహిరంగ వేలంలో కొబ్బరికాయలు, పూజాసామాగ్రి విక్రయించుకునే హక్కును గురువన్నపేటకు చెందిన లావణ్య రమేష్ రూ.18లక్షలు వేలంపాడి దక్కించుకోగా అమ్మవారి ఒడిబియ్యంను సేకరించుకునే హక్కును చాట్లపల్లి గ్రామానికి చెందిన అశోక్ 17.27 లక్షలకు, కొబ్బరిముక్కలను సేకరించుకునే హక్కు తీగుల్‌నర్సాపూర్ గ్రామానికి చెందిన కె.భాను రూ.5.61లక్షలు, దుకాణ సముదాయాలకు సంబంధించిన షాపు నెం.2ను రూ.17,500లకు నెల కిరాయి చొప్పున గుర్వన్నపేట గ్రామానికి చెందిన బచ్చలి కిషోర్, ఆలయం వద్ద తడకల పందిరివేసే హక్కును మర్పడ్గకు చెందిన నర్సింలు రూ.95వేలకు దక్కించుకున్నారు. ఈఓ రవికుమార్ మాట్లాడుతూ ఈ వేలంలో పాటపాడి వస్తువులను దక్కించు కున్న వారు 2024 డిసెంబరు 20 నుండి 2025 డిసెంబరు 20 వరకు హక్కులను కలిగి వుంటారని తెలిపారు. వేలంలో వచ్చిన ఆదాయాన్ని అమ్మవారి బ్యాంకు ఖాతాలో జమచేసి ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో బుగ్గ రాజరాజేశ్వరీ ఆలయ సూపర్వైజర్ శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వరస్వామి ఆలయ సూపర్వైజర్ చంద్రకుమార్, హను మాన్ ఆలయ సూపర్వైజర్ శ్రీకాంత్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్, గ్రామ మాజీసర్పంచ్ గర్నెపల్లి రజిత రమేష్, పాలకమండలి సభ్యులు కోట ఆశయ్య, చెక్కల నరేష్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌రెడ్డి, సిబ్బంది కనకయ్య, హరిబాబు, అంజయ్య, చందు, అర్చకులు గోవర్ధన్, కొండయ్య, తిరుపతి, లక్ష్మణ్, రమేష్, ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మినర్సింహారెడ్డి, గ్రామస్తులు యాదగిరి, కనకారెడ్డి, శ్రీను, స్వామి, ఐలయ్య, కనకయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా సిఎం పర్యటన ఏర్పాట్లు



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**పాపన్నపేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
ఈనెల 25వ తారీఖున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెదక్‌జిల్లా పర్యటనను పురస్కరించుకుని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సిఎం ఏడుపాయల వనదుర్గా ఆలయాన్ని దర్శించుకుంటారని, 100 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న మెదక్‌లోని చర్చిని సందర్శించనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాకలెక్టర్ ఏడుపాయల, పోతాన్‌శెట్టిపల్లి రెండవబ్రిడ్జి వద్ద హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. ఏడుపాయల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సతీష్, ఆలయ జూనియరర్ అసిస్టెంట్ సూర్య శ్రీనివాస్, ప్రధాన అర్చకులు శంకర్‌శర్మ, డిపిఆర్ఓ రామ చందర్ రాజు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెనూను అనుసరించి భోజనాలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**జహీరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
కొత్తగా ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందచేయాలని జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. శుక్రవారం రంజోల్ గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాల పరిసరాలను, తరగతిగదులను, వంట, స్టాక్‌రూమ్, భోజనం వండేందుకు సిద్ధంగా ఉంచిన కూరగాయలను, బియ్యం, చింతపండులను పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ రామ్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, ఎంపిడిఓ, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

## ప్రీక్రిస్మస్ వేడుకల్లో మాజీమంత్రి



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న మాజీమంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
క్రిస్మస్ పండగను క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటారని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ప్రీక్రిస్మస్ వేడుకలకు మాజీమంత్రి హాజరై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్‌కేక్‌ను కట్‌చేసి క్రైస్తవులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కండెం నర్సింలు, మండలాల అధ్యక్షులు మక్సుద్, రామలింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హర్షద్‌అలీ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్,, నాయకులు ముర్జల్, పాస్టర్లు రవి, రమేష్ బాబు, జైపాల్,పాల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు



రంజోల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**జహీరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
స్వంతస్థలాలు ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. మండలంలోని రంజోల్ గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్లసర్వేను శుక్రవారం కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ధరఖాస్తులు చేసుకున్న వారికి మొదటివిడతలో స్వంత ఇళ్లస్థలం ఉన్న నిరుపేదలకు, ఇల్లు శిథిలావస్థలో ఉన్నవారికి, ఇళ్లు కూలిపోయినవారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ రామ్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి బిక్షపతి, ఎంపిడిఓ, తహసీల్దార్, ప్రిన్సిపల్ ఉన్నారు.

## కంకోల్‌లో ఇళ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్



కంకోల్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

**మునిపల్లి, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కంకోల్‌గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లసర్వేను శుక్రవారం కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలనలో ధరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, స్వంత ఇళ్లు ఉన్న, ఇళ్లు కూలిపోయిన, శిథిలావస్థలో ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిల్లోడి సతీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



వైద్య శిబిరంలో దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
దివ్యాంగులు అన్ని అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ దివ్యాంగులకు సూచించారు. మెదక్ జిల్లా ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక దివ్యాంగ వైద్యశిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ దివ్యాంగులకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తామని, దివ్యాంగులకు ఏలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా పరిష్కరించాలని, అనారోగ్యంలో ఉన్నవారికి అన్ని రకాల ఉచిత నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో దివ్యాంగులకు సరైన వైద్యం అందుబాటులో లేని యెడల చికిత్స నిమిత్తం హైదరాబాదు లాంటి నగరాలకు కూడా పంపిస్తామన్నారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెల రెండో మంగళవారం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా ఆసుపత్రి సూపరింటిండెంట్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే... కెటిఆర్ పై అక్రమ కేసు నమోదు

**రామాయంపేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపడుతున్న ప్రజావ్యతిరేక చర్యలపై నిలదీస్తున్నందులకే బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై అక్రమంగా కేసు నమోదు చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకుడు కర్రె రమేష్ తెలిపారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్‌కు తెలంగాణ రాష్ట్రానికి ఇమేజ్‌ను పెంచడమే కెటిఆర్ చేసిన నేరమా..? అని ఆయన ప్రశ్నించారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో అవకతవకలు జరిగితే ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు ఎందుకు ముందుకు రావడంలేదని, కేవలం రాజకీయ కక్షసాధింపులో భాగమే ఈదుశ్చర్యలన్నారు. ఈరకమైన కాంగ్రెస్ దుశ్చర్యలు బిఆర్ఎస్ పార్టీనేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేవని, కెటిఆర్ అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుడుతోందని, ప్రజాసమస్యలపై ఆయన సాగిస్తున్న పోరాటాలకు భయపడి కేసులతో వేధించాలని ప్రభత్వం చేసిన కుట్ర అని రమేష్ ఆరోపించారు. బిఆర్ఎస్ నేతలు ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం దబాయింపు ధోరణితో విచారణల పేరిట అక్రమకేసులు పెడుతుందని ఆయన ఆరోపించారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌పై అసెంబ్లీలో చర్చపెడితే సమాధానం చెప్పేందుకు రెడీగా ఉన్నట్లు కెటిఆర్ స్పష్టం చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం పిరికిపందచర్య అని తెలిపారు. ప్రభుత్వ దుర్మార్గవిధానాలకు, ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజాసమస్యలపై కెసిఆర్ సారథ్యంలో, కెటిఆర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్రజాసమస్యలపై పోరాడుతామని ప్రజాస్వామ్యవాదులంతా కెటిఆర్‌పై బనాయించిన అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండించాలని ఆయన పేర్కొన్నారు.

## కెజివీల్స్ ట్రాక్టర్ పైనుండి పడి వ్యక్తి మృతి

**వెల్దుర్తి, డిసెంబరు 20, ప్రభాతవార్త:**
కేజీవీల్స్ ట్రాక్టర్ పైనుండి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం వెల్దుర్తి మండలపరిధిలోని ఆరేగూడెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆరేగూడెం గ్రామానికిచెందిన మెరుగు ప్రభాకర్ కేజీవీల్స్ ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుండి క్రిందపడటంతో ట్రాక్టర్ వైనుక వైపు ఉన్న గొర్రు తలకు తగలడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అయ్యప్ప పడిపూజలో మాజీ ఎమ్మెల్యే




అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సంజీవ్‌రావు పాటిల్ గృహంలో శుక్రవారం నిర్వహించిన అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు యాదవరావు పాటిల్ స్వామి, ఎంబిఆర్ యువసేన తాలుకా అధ్యక్షులు కిరణ్‌రావు పాటిల్ స్వామి, సంగమేశ్వర్‌స్వామి,నారాయణసేట్, భూమయ్య, శంకర్‌స్వామి, నరసింహులు స్వామి, చంద్రకాంత్‌స్వామి, అనిల్‌స్వామి, రవీందర్‌రెడ్డి స్వావి పాల్గొన్నారు.

### మాణిక్‌నగర్ తండాలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ



మాణిక్‌నగర్ తండాలో ఆలయ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

**నిజాంపేట్,డిసెంబరు20,ప్రభాతవార్త:** నిజాంపేట్ పంచాయితీ పరిధిలోని మాణిక్‌నగర్ తండాలో శుక్రవారం సేవాలాల్ మహారాజ్ దుర్గా భవాని మాత ఆలయ నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంగ్రామ్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మాణిక్‌రెడ్డి, భీమ్రావ్ నాయక్, బంగారు రాజు, రాధా కిషన్, జల శంకర్, సాయిలు, తండా నాయకులు పాల్గొన్నారు.

### కంకోల్‌లో పాఠశాలలను పరిశీలించిన డిఈఓ



కంకోల్ జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలిస్తున్న డిఈఓ వెంకటేశ్వర్లు

**మునిపల్లి, డిసెంబరు 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కంకోల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సదర్భంగా 10వ తరగతి విద్యార్థులతో డిఈఓ మాట్లాడుతూ ప్రత్యేక తరగతుల విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థాలను పరిశీలించి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. 10వ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిని సారించాలని ఆదేశించారు. విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు మాధురి, షఫీ ఆహ్మద్‌లను డిఈఓ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ భీంసింగ్, కంకోల్ తెలుగుమీడియంకాంప్లెక్స్‌ప్రధానోపాధ్యాయులుతుకారాం, ఉపాధ్యాయులు ఉమేష్, రాములు, రఫత్ జమీల, యాస్మిన్, నసీం బేగం పాల్గొన్నారు.

### రియాల్టర్‌లు కబ్జా చేస్తున్న భూమిని కాపాడాలంటూ రైతు ఆవేదన

**గుమ్మడిదల, డిసెంబరు 20 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలో తనకు వారసత్వంగా వస్తున్న నాలుగు ఎకరాల భూమిని కొంత మంది స్థానిక నాయకులు రియాల్టర్‌లతో కలిసి అక్రమంగా కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ అన్నారం గ్రామస్థుడు బెంబాడి సంజీవరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వారసత్వంగా వస్తున్న అన్నారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 261/ఈ, 261/అ లలో నాలుగు ఎకరాల భూమిని స్థానిక నాయకులు కొంతమంది రియాల్టర్‌లతో కలిసి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. గత వారం రోజులుగా జేసీబీలతో భూమిని చదును చేస్తూ అక్రమంగా కంటైనర్‌లను ఏర్పాటు చేశారని అన్నారు. ఇప్పటికే ఈ సమస్యను పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వమే తనను ఆదుకొని న్యాయం చేయవలసిందిగా కోరారు.

### రోడ్డుపై గుంతలను పూడ్పించిన ఎస్ఐ నరేష్

**ఝరాసంగం, డిసెంబరు 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని



మాచ్నూర్ గ్రామ శివారులో రోడ్లను పూడ్పింపచేస్తున్న ఎస్ఐ నరేష్

మాచ్‌నూర్ గ్రామం నుంచి కుప్పానగర్ గ్రామం వరకు గల రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను ఎస్ఐ నరేష్ ప్రత్యేక చొరవ తీసుకుని పూడ్పింపచేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను కంకర, డాంబర్ వేసి గుంతలను మాయం చేయించారు. రోడ్డుపై గుంతను పోలీసులు పూడ్పింపచేయడం పట్ల మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసుల తీరుపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ వాహన చోదకులు నిదానంగా ప్రయాణం చేయాలని, తమ స్వగ్రామాలకు సురక్షితంగా చేసుకునేలా వాహానాలను తోలాలని సూచించారు.

### శ్రీమన్నారాయణ చారిటబుల్ ట్రస్టు సేవా కార్యక్రమాలు...

**రామాయంపేట,డిసెంబర్ 20, ప్రభాతవార్త :**రామాయంపేట పట్టణంలోని శ్రీ చారిటబుల్ ట్రస్టు ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ ట్రస్ట్ నిర్వాహకుడు అంసానిపల్లె కన్నోజు గారి నాగభూషణాచారి తెలిపారు. 05-05-2023 బుద్ధ పౌర్ణమి శుక్రవారం రోజున భవాని శంకర అన్న ప్రసాద వితరణ సేవా క్షేత్రంను రామాయంపేట పట్టణములో ప్రారంభించడం జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు వివిధ రకాల సేవాకార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. భవాని శంకర అన్న ప్రసాద వితరణ సేవ క్షేత్రం శ్రీ శ్రీమన్నారాయణ చారిటబుల్ (ట్రస్టు రి.నం.1/ఐవి/2024) ఆధ్వర్యంలో మొదటి ఉచిత వివాహం 06-12-2023 బుధవారం రోజున చి.ల.సౌ. బైండ్ల మౌనిక పొద్చన్‌పల్లి - మురికి మహేష్‌ల వివాహం అంగరంగవైభవంగా జరిగిందన్నారు. నాటి నుండి నేటి వరకు (10) వివాహాలు క్షేత్రంలో నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా రామాయంపేట చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న కడు బీదవారు, తల్లి తండ్రి లేని అనాథలు, పెళ్లి వయస్సుకు ఎదిగిన వారికి తామే స్వయంగా ఖర్చులను భరించి అర్హులైన వారికి పెళ్లి చేయిస్తామని తెలిపారు.

## కనీస వసతులు లేని తాండా పాఠశాలలు

-5 తరగతులు, 17మంది బాలురు, ఒక్కరే టీచరు
-మరుగుదొడ్లు, కిచన్ షెడ్ లేవు

**సిర్గాపూర్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** అందరు అక్షరాస్యులు కావాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ప్రభుత్వానికి ఆ తండా పాఠశాల గుర్తుకు రానట్టుంది. పాఠశాలలో విద్యను అందుకుంటున్న బాలబాలికలకు, ఉపాధ్యాయులకు పాఠశాల ఆవరణలో మరుగుదొడ్డి, మూత్ర శాలలు ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆ తండా పాఠశాలలో కనీసం ఒక్క మరుగుదొడ్డి కాని, మూత్రశాలలు, వంటగది సైతం లేదంటే ఆ పాఠశాలపై అధికారులకు, పాలకులకు ఏ మేర అభిమానం ఉందో ప్రత్యేకంగా చర్చించుకోవాల్సిన అవసరం లేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే...మండల పరిధిలోని జెముల తాండ పంచాయితీ పరిధిలోని జీవుల తాండలో ప్రాథమిక పాఠశాల (5వ తరగతి వరకు)లో 17 మంది బాలురు (బాలికలు లేరు) విద్యను అందుకుంటుండగా ఒకే ఒక్క ఉపాధ్యాయిని 5 తరగతుల్లోని 17 మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాల బోర్డుపై కనీసం పాఠశాలపేరు సైతం లేకపోవడం,ఆవరణలో ఒక్క మరుగు దొడ్డి లేకపోవడం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు వంట గది కూడా లేకపోవడం, కనీసం తాగు నీటి సౌకర్యం లేకపోవడం విస్మయాన్ని కల్గిస్తోంది. మరుగుదొడ్లు, మూత్ర శాలల సౌకర్యాలు లేక పోవడంతో తండాకు చెందిన బాలికలను పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రాకుండా ఇతర గ్రామాల్లోని పాఠశాలల్లో చేర్పించి విద్యను అందిస్తున్నట్లు తెలుస్తోంది. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయిని మరుగుదొడ్లు లేక పడుతున్న అవస్థలు అన్ని ఇన్నికావు. విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం వంటకాలను మధ్యాహ్నభోజనం నిర్వాహకురాలు తమ ఇంటి వద్దనే వంటలు వండి పాఠశాలకు తెచ్చి విద్యార్థులకు వడ్డిస్తూ వస్తోంది. విద్యార్థులు తాగునీటిని తమ ఇండ్ల నుంచే తెచ్చుకుని దప్పిక తీర్చుకోవాల్సిన దయనీయ స్థితి దాపురించింది. పాఠశాలలో మరుగుదొడ్డి, మూత్రశాలలు నిర్మిస్తే బాలికలు సైతం పాఠశాలలో చేరి విద్యను అందుకునే అవకాశాలు ఉండటంతో పాటు మహిళా ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పడం అతిశయోక్తి కాదు. జిల్లాకలెక్టర్, ఎంపి, ఎమ్మెల్యేలు స్పందించి పాఠశాలలో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



జీవుల తాండలోని ప్రాథమిక పాఠశాల భవనంపై పేరు కనిపించని దృశ్యం
ఎస్‌పిఆర్ పి-2: అపరిశుభ్రంగా ఉన్న జీవుల తాండ పాఠశాల దృశ్యం

## క్లీన్‌వెంట్ పరిశ్రమ ముందు కానుకుంట రోడ్డుకు మరమత్తులు

**గుమ్మడిదల, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకోకుండా గుంతల మయంగా మారి వస్తూ పోయే వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో అనంతారం పరిధిలో గల క్లీన్ వెంట్ పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్ శశికాంత్ రోడ్డు పరిస్థితి చూసి కనీసం తమ పరిశ్రమ ముందు అయినా గుంతలను పూడ్చాలని సొంత నిధులు వేచ్చించి సిమెంట్‌తో గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానుకుంట రోడ్డు చాలా సంవత్సరాల నుండి గుంతల మయంగా మారి వస్తూ పోయే వాహదారులకు చాలా ఇబ్బందిగా మారిందని, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సొంత నిధులు వెచ్చించి మరమ్మత్తులు చేసినా తారు లేకపోవడంతో మళ్లీ గుంతల మయంగా ఏర్పడి వస్తూ పోయే వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, కనీసం తమ పరిశ్రమ ముందయినా ఏర్పడిన గుంతలు పూడ్చడం జరిగిందని తెలిపారు. ఇకనైనా అధికారులు, నాయకులు కానుకుంట రోడ్డును పట్టించుకోని ప్రమాదాలు జరగకుండా తారు వేయించాలని కోరారు.



క్లీన్‌వెంట్ కానుకుంట రోడ్డుకు మరమత్తులు చేస్తున్న దృశ్యం

## అమిత్‌షా దిష్టి బొమ్మ దగ్ధం-రాస్తా రోకో



అమిత్‌షా వాఖ్యలను నిరసిస్తూ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

**పాపన్నపేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై బిజెపి అగ్రనేత, కేంద్ర మంత్రి అమిత్‌షా చేసినవాఖ్యలకునిరసనగాశుక్రవారం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని మెదక్-బొడ్మట్‌పల్లి రహదారిపై అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేసి రోడ్డుపై భైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. మరో మారు ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే రాష్ట్ర బందక్‌కు పిలుపునిస్తామని వారు హెచ్చరించారు. మహేందర్, ఉపేందర్, మహేష్, కృష్ణ, ప్రశాంత్, హరీష్, సందీప్, మిన్నూర్ దావీద్, నాగసాన్‌పల్లి నాయకులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు కొత్తపల్లి విద్యార్థి



ఎంపికైన విద్యార్థిని ప్రశంసాపత్రం అందచేస్తున్న దృశ్యం

**పాపన్నపేట,డిసెంబరు 20, ప్రభాతవార్త:** జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ చాటిన మండల పరిధిలోని కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో విద్యను అందుకుంటున్న విద్యార్థి వెంకటేష్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల మెదక్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో వెంకటేష్ ప్రథమ స్థానం కైవశం చేసుకుని అందరితో శభాష్ అనిపించుకున్నాడు. విద్యార్థి వెంకటేష్‌ను ప్రధానో పాధ్యాయులు దత్తురెడ్డి, ఉపాధ్యాయులుశివకుమార్, నాగభూషణం వేణుగోపాల్, ప్రసాద్‌రెడ్డి, తులసిరామ్‌లు ప్రత్యేకంగా అభినందించారు

### మరమ్మత్తులు చేపట్టాలి బిఆర్ఎస్ నాయకులు ప్రభాకర్

**చిన్నశంకరంపేట,డిసెంబర్ 20,ప్రభాతవార్త:**చిన్నశంకరంపేట నుండి జంగరాయి వరకు రోడ్డును నిర్మించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బందెల ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ చిన్నశంకరంపేట నుండి జంగరాయి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, ఈ రోడ్డును గత 13 సంవత్సరాల క్రితం జంగరాయి వరకు బిటి రోడ్డును వేశారని అన్నారు. నేటి వరకు ఆ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టకపోవడంతో ప్రజలు, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గత బిఆర్ఎస్‌పార్టీహాయంలమాజీఎమ్మెల్యేపద్మారెడ్డి చిన్నశంకరంపేట-జంగరాయి రోడ్డు మరమ్మత్తులకోసం రూ.కోటి28లక్షల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు మర్మత్తులు చేపట్టాలని లేని యెడల బిఆర్ఎస్ పార్టీ తరుపున మూడు గ్రామాల ప్రజలతో ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు ఇమ్మడి నరేష్‌లు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగులకు తపస్ ఆర్థిక సహాయం



ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న తపస్ నాయకులు

**కొల్చారం, డిసెంబరు20 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కొల్చారం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధు, శ్రీనివాస్‌లు తపస్ మద్దతు ప్రకటించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 0ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా, మండల బాధ్యులు రాజేశ్వర్, ప్రవీణ్, సురేందర్, కిషన్, సతీష్, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

### ఆటో డ్రైవర్‌ల ముందస్తు అరెస్టు

**వెల్దుర్తి, డిసెంబరు 20 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్‌ల సంఘం పిలుపు మేరకు ఛలో అసెంబ్లీ కార్యక్రమం ఉన్నందున శుక్రవారం వెల్దుర్తి మండల ఆటో డ్రైవర్లు తరలి వెళ్లకుండా వెల్దుర్తి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్వంత పూచీకత్తుపై మధ్యాహ్నం వదిలిపెట్టారు.

### అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేసిన దళిత సంఘాలు

**వెల్దుర్తి, డిసెంబరు20 ప్రభాతవార్త:** అంబేద్కర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా మాసాయిపేట మండల కేంద్రంలో శుక్రవారం కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దళిత సంఘాల ఆధ్వర్యంలో దగ్ధం చేశారు.

### నేడు తాండూరు గ్రామంలో ఉచిత మెగా వైద్యశిబిరం

**రామాయంపేట, డిసెంబరు20, ప్రభాతవార్త** :నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామంలో ఈనెల 22వ తేదీ శనివారం రోజున మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆరోగ్య శిబిరాల ప్రతినిధి లయన్ దామోదర్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుభాష్‌చంద్రబోస్, కోశాధికారి డి.జి. శ్రీనివాస శర్మ తెలిపారు. మేడ్చల్ మెడిసిటీ హాస్పిటల్ వారి సహకారంతో తాండూర్ గ్రామంలో (పోస్ట్ ఆఫీస్ పక్కన) మెగా ఉచిత ఆరోగ్య శిబిరం జరుగుతుందన్నారు. శిబిరం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని, ఉచితంగా మెడిసిన్స్ కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్‌క్లబ్‌లను కూడా భాగస్వాములను చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

### ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



**పాపన్నపేట,డిసెంబరు 20, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన పాపన్నపేటకు చెందిన ఏడుపాయల ఆలయ మాజీ డైరెక్టర్ సుంకరి కృష్ణ (గురుస్వామి) నివాసంలో శుక్రవారం అయ్యప్పస్వామి మహాపడి పూజా కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో నేత్ర పర్వంగ నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు పాపన్నపేట, టేక్మాల్ మండలాలనుంచి అయ్యప్ప దీక్షపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పడి సుంకరి కృష్ణ గురుస్వామి పడిని వెలిగించగా అయ్యప్ప దీక్షాపరులు భజనలు చేస్తూ పాటలు అలిపించిన పాటలు భక్తులకు ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమాలు సుగుణాకర్ గురుస్వామి, వెంకట్‌గౌడ్ స్వామి,శివస్వామి, ఆలయ్యస్వామి, అనిల్‌స్వామిపాల్గొన్నారు.

## కెటిఆర్‌పై క్యాంగ్రె స్ అక్రమ కేసులు: బిఆర్ఎస్ నేత గోవర్ధిరెడ్డి ధ్వజం

**గుమ్మడిదల, డిసెంబర్ 20 ప్రభాతవార్త:** కేటీఆర్‌ను ధైర్యంగా ఎదుర్కోలేకే అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై ఈ కార్ రేస్ వ్యవహారంలో అక్రమంగా కేసులు పెట్టడంపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి స్పందించారు.

ఈ సందర్భంగా గుమ్మడిదల మండల కేంద్రంలోని సీజీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్ రేస్ వ్యవహారంలో అసెంబ్లీలో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించినప్పటికీ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటని అన్నారు. ప్రజల్లో అతి కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత రావడం, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ పెరగడం చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి పనులను చేస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ధైర్యంగా ఎదుర్కోలేకే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కేసులు ఎన్ని పెట్టినా ప్రజల పక్షాన ప్రతిపక్షంగా ఎల్లప్పుడూ బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి పనులను మానుకోవాలని హెచ్చరించారు. లేకుంటే అతి కొద్ది రోజుల్లోనే రేవంత్ రెడ్డి సర్కార్ కుప్పకూలడం ఖాయమని అన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన కాంగ్రెస్ నేతలు



లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**జహీరాబాద్, డిసెంబరు 20, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంతో పాటు న్యాల్‌కల్, జహీరాబాద్, కోహీర్ మండలాలకు చెందిన లబ్దిదారులకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురైన బాధితులు కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్సలు అందుకునేందుకు పలువురికి 7లక్షల 45వేల500 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను పట్టణంలోని ఆదర్శనగర్‌లోని సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి నివాసంలో బాధితులకు అందచేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నర్సింహారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రాములు, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, మాజీ కౌన్సిలర్ శేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె జగదీశ్వర్‌రెడ్డి, బి మల్లికార్జున్, సోమప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలి



హాస్టల్స్ ను తనిఖీ చేస్తున్న మండల స్పెషల్ అధికారి నూతన్‌కుమార్

**కంగ్టి, డిసెంబరు 20 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఇటీవల విద్యార్థులకు నూతనంగా డైట్ మెను పెంచడంతో విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని కంగ్టి మండల ప్రత్యేక అధికారి నూతన్‌కుమార్ అన్నారు. శుక్రవారం కంగ్టిలోని బీసీ, ఎస్సీ, కస్తూర్బా గాంధీ బాలికల హాస్టల్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల నూతనంగా డైట్ మెను పెంచడంతో ఆయా హాస్టల్లోని వార్డెన్లు రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. అనంతరం కంగిన మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తుర్కవడగామ్, చాప్టా బి కంగ్టి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఈ నెలఖారు వరకు సర్వేను పూర్తి చేయాలని అన్నారు. విధుల్లో ఎవరైన నిర్లక్ష్యంవహిస్తే కఠినచర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

### శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు




కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ల బృందం

**నారాయణఖేడ్, డిసెంబరు 20 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు శ్రీ సత్యసాయి సేవా సమితిజిల్లా అధ్యక్షులుశంకరప్ప అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కంటి ఆసుపత్రి నానక్‌రాం గూడ హైదరాబాద్ వైద్య బృందం ఆధ్వర్యంలో42 మందికికంటి వైద్య పరీక్షలు నిర్వహించి అందులో కొందరికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉన్నట్లు కంటి వైద్యులు గుర్తించారు. అవసరమైన23 మందికి గుర్తించి కంటి ఆపరేషన్ హైదరా బాద్‌లో నిర్వహించారు. అవసరమైన వారికి సరిపడా మందులు అందజేసి రెండురోజులతర్వాత తిరిగి కంటి రోగులకు నారాయణఖేడ్ ప్రాంతంలోని వారి వారి గ్రామాలకు పంపించారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రతి నెల నారాయణఖేడ్ పట్టణంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హన్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి కబడ్డీ జూనియర్ జట్టు ఎంపిక



రాష్ట్ర స్థాయి కబడ్డీ జూనియర్ జట్లుకు ఎంపికైన క్రీడాకారులు

**పాపన్నపేట, డిసెంబరు 20, ప్రభాతవార్త:** జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల జూనియర్ జట్టును శుక్రవారం మండల పరిధిలోని యూసుఫ్‌పేటలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఎన్నుకున్నారు జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి బాలుర విభాగంలో 125 మంది, బాలికల విభాగంలో 75 మంది క్రీడాకారులు హాజరు కాగా ప్రతిభ చాటిన 12 మంది చొప్పున రెండు జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 22వ తారీఖు నుంచి 25వ తారీఖు వరకు హకీంపేట్ మేడ్చల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలికలు, ఈ నెల 27 నుంచి 30వ తారీఖు వరకు జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలురు తలపడనున్నారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, సభ్యులు కుమార్, శ్రీకాంత్, శశికుమార్, రాజాగౌడ్, రవిలు తెలిపారు.

### సంగం(కే)ను పంచాయితీగా ఏర్పాటు చేయాలి

**ఝరాసంగం, డిసెంబరు 20,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి పంచాయితీ పరిధిలోని సంగం(కే) గ్రామాన్ని పంచాయితీగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను పురష్కరించుకుని శుక్రవారం డిఎల్‌పిఓ అమృత, ఎంపిడిఓలు గ్రామ సభను నిర్వహించారు. సభలో గ్రామస్థులు అభిప్రాయాలను, సూచలను తెలుసుకున్న అధికారులు ఉన్నతాధికారులకు నివేదక అందచేస్తామన్నారు. ఇదిలా ఉండగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్ సంగం(కే) గ్రామాన్ని పంచాయితీగా ఏర్పాటు చేయాలని ఎంపిడిఓకు వినతి పత్రం అందచేశారు.

